నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శనివారం 1 ఫిబ్రవరి 2025 | MAHABUBNAGAR NARAYANPET



వనపర్తి, కల్వకుర్తి, భూత్పూరు, మహబూబ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్లు గట్టుయాదవ్, ఎడ్మ సత్యం, బస్వరాజ్‌గౌడ్, నర్సింహులును సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్



కేటీఆర్ చేతుల మీదుగా సన్మానం అందుకున్న అయిజ మున్సిపల్ మాజీ చైర్మన్ దేవన్న, పెబ్బేరు, శాంతినగర్, అమరచింత, కొత్తకోట మాజీ చైర్‌పర్సన్లు కరుణశ్రీ, కరుణ, మంగమ్మ, సుకేశిని విశ్వేశ్వర్



అలంపూర్ మాజీ చైర్‌పర్సన్ మనోరమను సన్మానిస్తున్న కేటీఆర్, శ్రీనన్న, విజయుడు

# ఆత్మీయ సత్కారం

- **మున్సిపల్ మాజీ చైర్మన్, చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లను సన్మానించిన కేటీఆర్**
- **హాజరైన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు**

గత ఐదేండ్ల కాలంలో మున్సిపాలిటీలను అభివృద్ధికి కృషి చేసిన బీఆర్‌ఎస్ మున్సిపల్ మాజీ చైర్మన్లు, చైర్‌పర్సన్లు, మాజీ వైస్ చైర్మన్లను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్మానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేసీఆర్ లోగోతో ఉన్న మెమెంటోలను వారికి అందజేశారు. కార్యక్రమంలో మాజీమంత్రులు జగదీశ్వర్ రెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు విజయుడు, కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి తోపాటు పలువురు పాల్గొన్నారు.



రైతులు, మత్స్యకారులు స్వచ్ఛందంగా జేసీబీ సాయంతో డీ-1 కాల్వలో పూడికతీత పనులు చేయిస్తున్న దృశ్యం

# విరాళాలతో పూడికతీత

- **ముందుకొచ్చిన రైతులు, మత్స్యకారులు**
- **రూ.3 లక్షలతో డీ-1 కాల్వలో ముళ్లపొదల తొలగింపు**
- **బింగిదొడ్డి చెరువులో నీటినిల్వ పెంచేలా చర్యలు**

అయిజ, జనవరి 31 : అయిజ మండలంలోని బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వకు రైతులు చర్యలు చేపట్టారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటిమట్టం పెంచేందుకు మత్స సహకార సంఘంతో కలిసి ముందుకొచ్చారు. ఓవైపు చేపలు పెంచేందుకు.. మరోవైపు ఆయకట్టు సాగుకు అవసరమైన నీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూడిక పెరగడంతో పూర్తిస్థాయిలో నీరు చేరడం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన రైతులు, ఇరిగేషన్ అధికారులకు విన్నవించారు. రిజర్వాయర్ నుంచి కాల్వ తవ్వాలని విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం నుంచి ఆమోదం లభించకపోవడంతో అధికారుల స్పందన రాలేదు. దీంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు దాదాపు 3 కిలోమీటర్ల డీ-1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు విరాళంగా వేసుకొని పనులు చేపడుతున్నట్లు రైతులు తెలిపారు. తప్పెట్లమొర్సు, దేవబండ, బింగిదొడ్డి చెరువు వరకు కాల్వను శుభ్రపర్చనున్నట్లు రైతులు తెలిపారు. దీంతో నీటి నిల్వలకు ఢోకా ఉండదని, చేపలు పెంచుకోవచ్చని, అలాగే సాగుకు నీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కుంటకు గండి.. నీళ్లు ఖాళీ



పొల్కెపహాడ్‌లోని దొడమోనికుంట అలుగు వద్ద గండి పడి వృథాగా దిగువకు పారుతున్న నీళ్లు

గోపాల్‌పేట, జనవరి 31 : మండలంలోని పొల్కెపహాడ్ గ్రామ శివారులోని దొడమోని కుంటకు గండి పడి నీళ్లు ఖాళీ అవుతున్నాయి. దీంతో కుంట కింద వరి సాగు చేసిన రైతులతోపాటు, సమీపంలోని బోరుబావుల రైతులు ఆందోళన చెందుతున్నారు. కుంటలో నీళ్లు ఉంటే ఆయకట్టు రైతులకే కాకుండా, బోరు బావుల రైతులకు మేలు జరుగుతుంది. ఎగువనున్న చింతల కుంట నుంచి వచ్చే కే ఎల్‌ఐ నీళ్లతో దొడమోని కుంట నిండుతున్నది. ప్రస్తుతం కేఎల్‌ఐ నీళ్లు దొడమోని కుంటకు వస్తున్నా, కుంటకు అలుగు వద్ద గండి పడడంతో, అలుగు ద్వారా పోయే నీళ్లు గండి ద్వారా వృథాగా దిగువకు పోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కుంట అలుగు ధ్వంసమై చాలా కాలమవుతున్నా పట్టించుకునే వారే లేరని, గండి మరమ్మతుతోపాటు, అలుగు నిర్మాణం కూడా నాణ్యవంతంగా చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్‌ను వివరణ కోరగా కుంటకు గండి పడిన విషయం శుక్రవారం గ్రామ రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని, శనివారం గండి పడిన ప్రదేశంలో మరమ్మతులు చేయించి, కుంటలోని నీళ్లు వృథా కాకుండా చూస్తామన్నారు.

# ప్రయాణం.. ప్రాణసంకటం



జేసీబీ బకెట్‌లో కూర్చొని ప్రమాదభరితంగా ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

- **జేసీబీ బకెట్‌లో విద్యార్థుల ప్రయాణం**

నవాబ్‌పేట, జనవరి 31 : మారుమూల గ్రామాల నుంచి ప్రభుత్వపాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ప్రయాణం ప్రాణసంకటగా మారింది. సరైన రవాణ సౌకర్యం లేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రతి రోజూ ఏడెనిమిది కిలోమీటర్లు నడవలేక రోడ్ల వెంబడి ఏ వాహనం వస్తే అది ఎక్కి భయ భయంగా ప్రయాణిస్తున్నారు. ఇందుకు అద్దం పట్టే ఘటన లింగంపల్లి గ్రామశివారులో దర్శనమిచ్చింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే... నవాబ్‌పేట మండలం లింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆర్‌సీపూర్, ఊరంచుతండా, కుత్నేపల్లి చెందిన విద్యార్థులు నడుచుకుంటు వస్తారు. శుక్రవారం కొంతమంది విద్యార్థులు జేసీబీ బకెట్‌లో కూర్చొని ప్రమాదభరితంగా చేసిన ప్రయాణం చేయడం నమస్తేతెలంగాణ కంట పడింది. ఇదేమిటని విద్యార్థులను ప్రశ్నిస్తే..ప్రతి రోజూ పాఠశాలకు రావడం, పోవడం మొత్తం 10 కిలోమీటర్లు నడుస్తున్నామని, అందుకే ప్రతి రోజూ ఎవరైనా ఇలా వెళ్తుంటే వారి వాహనం ఎక్కి వెళ్తామని లేదంటే నడుచుకుంటూ వెళ్తామని సమాధానం చెప్పారు.

# సాఫ్ట్‌బాల్ పోటీల్లో రన్నరప్‌గా పాలమూరు..

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 31 : మెదక్ జిల్లా తుఫ్రాన్‌లో ఈనెల 29 నుంచి 31 వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ - 14 బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. మూడు రోజులు జరిగిన ఈ పోటీల్లో నిజామాబాద్ జట్టు విజయం సాధించగా పాలమూరు జట్టు రన్నరప్‌గా నిలిచింది. జిల్లా జట్టును డీవైఎస్‌వో శ్రీనివాస్,ఎజీఎఫ్ సెక్రటరీ శారదాబాయి, వేణుగోపాల్,కోచ్ నారాజ్,రఘు అభినందించారు.



రన్నరప్‌గా నిలిచిన పాలమూరు జట్టు

## సహజ వనరులన్నీ విషపూరితమే..

ఫ్యాక్టరీ ఏర్పాటైతే సహజ వనరులన్నీ విషపూరితం అవుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీని నుంచి వెలువడే రసాయనాల వల్ల పెద్దధన్వాడతోపాటు పక్కనే ఉన్న చిన్నధన్వాడ, చుట్టుపక్కల గ్రామాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. వెలువడే రసాయనాలతో నేలసారం తగ్గి దిగుబడితోపాటు నీటి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉన్నదన్నారు. ఈ నీటిని తాగితే పశువులు, చేపపిల్లలు చనిపోయే ప్రమాదం ఉందని ఆవేదన చెందారు. చర్మవ్యాధులు, శ్వాసకోశ, సంతానోత్పత్తి తగ్గడం, క్యాన్సర్, అలర్జీ, కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, కంటిచూపు తగ్గడం వంటి ఇబ్బందులతోపాటు మెదడు పనితీరుపై ప్రభావం చూపనున్నాయని పరిశోధనలో వెల్లడైనట్లు స్థానికులు వాపోతున్నారు. సుమారు 35 కిలోమీటర్ల మేర గాలి కాలుష్యంగా మారనున్నదని పర్యావరణవేత్తలు చెబుతున్నారు.



## దీక్షలు విరమించాలని ఒత్తిడి

ఇథనాల ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని రిలే దీక్షలు చేస్తున్న రైతులకు బెదిరింపులు వస్తున్నాయి. అటు రెవెన్యూ అధికారుల, ఇటు పోలీసుల వేధింపులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఓ వైపు గుట్టుగా కంపెనీ పనులు మొదలు పెట్టాలని యాజమాన్యం ప్రయత్నిస్తుంటే హామీని ఇచ్చినట్టే ఇచ్చి దీక్షలు విరమించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. అయినా ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేసే వరకు పోరాటం ఆపేది లేదని తేల్చి చెబుతున్నారు. అన్ని గ్రామాల ప్రజల అభిప్రాయాలు సేకరించాలని, ఆ తర్వాతే దీక్షలు విరమిస్తామని పేర్కొంటున్నారు. మేము స్వచ్ఛందంగా ఆందోళనలు చేస్తున్నామని, మాకు ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదని ఖరాఖండిగా చెబుతున్నారు.

*పచ్చని పల్లెల్లో 'ఇథనాల్' మంటలు రాజుకున్నాయి. ఫ్యాక్టరీ పేరు వింటేనే రైతులు ఉలిక్కిపడుతుండగా.. గ్రామాలు వణుకుతున్నాయి. పెద్ద ధన్వాడ వద్ద ఫ్యాక్టరీకి అనుమతులు ఇవ్వొద్దంటూ స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో 10 వేల ఎకరాలపై తీవ్ర ప్రభావం పడుతుండడంతో చిచ్చు రేగింది. 12 గ్రామాల వాసులు తిరుగుబావుటా ఎగురవేశారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కంపెనీకి ఎలా అనుమతులు ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు, ప్రజలు దీక్షలు చేపట్టారు. దీంతో రాజోళి మండలంలో ఒక్కసారిగా హైటెన్షన్ మొదలైంది. ఆలస్యంగా మేల్కొన్న రైతులు ఈ ఫ్యాక్టరీ మాకొద్దు.. అంటూ తిరుగుబావుటా ఎగురవేశారు. ఏపీలోని చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన వ్యక్తికి ఇక్కడి నాయకులు వత్తాసు పలకడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఫ్యాక్టరీ ఏర్పాటైతే ఇక్కడి సహజ వనరులన్నీ విషపూరితం అవుతాయని అంటున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం చెందుతున్నారు.*

*– గద్వాల, జనవరి 31*



ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే ప్రదేశం

## పచ్చని పల్లెల్లో
# ఇథనాల్ చిచ్చు!

- **ఫ్యాక్టరీ ఏర్పాటైతే బీళ్లుగా పొలాలు**
- **సహజ వనరులన్నీ విషపూరితమే..**
- **10 వేల ఎకరాలపై తీవ్రప్రభావం**
- **పేద దళితులు రోడ్డునపడే అవకాశం**
- **ప్రజాభిప్రాయ సేకరణకు రాంరాం**
- **వ్యతిరేకిస్తున్న 12 గ్రామాల ప్రజలు**
- **దీక్ష విరమించాలని బెదిరింపులు**
- **పట్టించుకోని ప్రజాపాలన ప్రభుత్వం**
- **రైతులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మద్దతు**

తుంగభద్ర నది తీరాన.. ప్రశాంత వాతావరణంలో 12 గ్రామాల ప్రజలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే అక్కడి స్థానికులకు పిడుగు లాంటి వార్త తెలియడంతో భయాందోళనకు గురవుతున్నారు. రాజోళి మండలంలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు విషయం తెలుసుకొని ఆందోళనకు దిగారు. పచ్చని పొలాలు, పల్లెలు, నది, గాలిని కలుషితం చేసే ఫ్యాక్టరీ మాకు వద్దంటూ ఆందోళన చేపట్టారు. ఇప్పటికే నారాయణపేట జిల్లా చిత్తనూర్‌లో ఇలాంటి కంపెనీని రాకుండా అక్కడి రైతులు, ప్రజలు అడ్డుకున్నారు. గ్రామ పంచాయతీ తీర్మానం లేదు.. ప్రజల అభిప్రాయాలు సేకరించకుండా కంపెనీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండడంపై స్థానికులు మండిపడుతున్నారు. అందుకు సంబంధించిన రోడ్డు, విద్యుత్ పనులు చేస్తుండడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వ్యతిరేకంగా 12 గ్రామాల ప్రజలు ఆందోళనలకు దిగారు. కలెక్టర్‌కు, ప్రజాప్రతినిధులకు సైతం వినతిపత్రాలు అందజేశారు. ఆందోళనలతో పనులు నిలిపిన యాజమాన్యం.. మళ్లా ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నది. దీంతో వారం రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కాసులకు కక్కుర్తిపడిన అధికారులు పంట పొలాలు ఏమైతేనేమి.. రైతులు రోడ్డున పడ్డా మాకేంటి.. అన్నట్లు ఫ్యాక్టరీకి సంబంధించి నీటి కేటాయింపులు ఇరిగేషన్ అధికారులు చేశారు. ఫ్యాక్టరీ ఎప్పటికీ ఒక టీఎంసీ నీరు నిల్వ ఉండేలా అధికారులు ఇచ్చారు. అయితే ఫ్యాక్టరీ నుంచి వెలువడే రసాయనాలు రివర్స్ పంపింగ్ ద్వారా నదిలోకి వదిలేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ నీరు తుంగభద్రలోకి వదిలితే నదినీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నదని రైతులు వాపోతున్నారు. విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ విషయం తెలిసిన రైతులు ఫ్యాక్టరీ వస్తే బంగారు పంటలు పండే భూములు బీడు భూములుగా మారడం ఖాయమన్నారు. కంపెనీకి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నా అధికార పార్టీ నాయకులు మాత్రం ఇక్కమాట మాట్లాడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

### 29 ఎకరాల్లో ఏర్పాటు

రాజోళి మండలం పెద్ద ధన్వాడ వద్ద గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయల్స్ ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. తుంగభద్ర నది నుంచి రెండు మోటర్ల ద్వారా నీటిని నిరంతరం ఇథనాల్ ఉత్పత్తికి వినియోగించుకునేలా అనుమతులు ఇచ్చారు. నిత్యం సుమారు 1.20 లక్షల లీటర్ల ఇంధనం ఉత్పత్తి చేసేలా రూ.189 కోట్లతో 29 ఎకరాల్లో ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నారు. అయితే పనులు ప్రారంభించేందుకు యత్నించగా.. స్థానికులు అడ్డుకున్నారు. అక్కడికి రెవెన్యూ అధికారులు, పోలీసులు వెళ్లి స్థానికులతో చర్చించిన తర్వాతే పనులు చేపడతారని చెప్పారు. అయితే కంపెనీ యాజమాన్యం తిరిగి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండగా.. మరోసారి అడ్డుకున్నారు. ఈ ఫ్యాక్టరీ మాకొద్దంటూ కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపట్టారు. అయినా కంపెనీ యాజమాన్యం మొండిగా పనులు ప్రారంభించే ప్రయత్నం చేస్తుండడంతో ఊరూరా ఉద్యమాలు మొదలయ్యాయి.

### 10వేల ఎకరాలపై ప్రభావం

ఇథనాలు ఫ్యాక్టరీ ఏర్పాటైతే పెద్ద ధన్వాడ, చిన్నధన్వాడ, చిన్నతాండ్రపాడ్, నౌరోజీ క్యాంపు, కేశవరం, వేణిసోంపురం, తుమ్మిళ్ల, మాన్‌దొడ్డి, నసనూర్, పచ్చర్ల, తనగల, పెద్దతాండ్రపాడ్, రాజోళి గ్రామాల పరిధిలో సుమారు 10వేల ఎకరాలపై ప్రభావం పడే అవకాశం ఉన్నది. కంపెనీ నుంచి వెలువడే రసాయనాలతో బీడు భూములు పెరగనున్నాయి. దీని నుంచి వచ్చే వ్యర్థాలు వాగు, సమీపంలోని తుంగభద్ర నదిలో కలవడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉన్నది. అందుకే స్థానికులు వ్యతిరేకిస్తున్నారు.

### అనారోగ్యం పాలయ్యే అవకాశం

కేసీఆర్ ప్రభుత్వం పెద్దధన్వాడ గ్రామంలోని పేద దళితులకు 152 ఎకరాలు ప్రభుత్వ భూమిని కేటాయించింది. ఈ భూముల్లో పొగాకు, మిరప, వేరుశనగ, కంది పంటలు సాగు చేసుకొని జీవిస్తున్నారు. ఈ పొలాల పక్కనే ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుండడంతో భూములు సాగు చేసుకునే జీవించే దళితులకు అన్యాయం జరిగే అవకాశం ఉన్నది. దీనికితోడు 2009లో తుంగభద్ర నదికి వరదలు వచ్చిన సమయంలో ప్రభుత్వం ప్రస్తుతం ఫ్యాక్టరీ నిర్మాణం చేసే పొలం పక్కనే దళితులకు ఆరెకరాల భూమిని ఇండ్ల నిర్మాణానికి నాటి సర్కారు కేటాయించింది. ప్రస్తుతం అక్కడే ఫ్యాక్టరీ ఏర్పాటు కానుండడంతో భవిష్యత్‌లో తాము అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.



## రైతులకు బీఆర్‌ఎస్ నేతల మద్దతు

రైతులకు నష్టం కలిగించే ఎలాంటి ఫ్యాక్టరీనైనా అడ్డుకుంటామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి భరోసా ఇచ్చారు. ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రిలే దీక్షలు చేస్తున్న రైతు శిబిరానికి మద్దతు తెలిపారు. పొలాలను నాశనం చేసే పరిశ్రమ అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది నవంబర్ 8న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.

## విషం చిమ్మే పరిశ్రమ మాకొద్దు



పచ్చని పల్లెలపై విషం చిమ్మే ఈ పరిశ్రమ మాకొద్దు. ఇప్పుడిప్పుడే రైతులు ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే మా పచ్చని పొలాలు బీడులుగా మారే అవకాశం ఉన్నది. ఎట్టి పరిస్థితిలో ఫ్యాక్టరీ నిర్మాణం జరగనివ్వం. గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల ప్రజలు, పొలాలకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. మా పంటలు దెబ్బతింటాయి. భూముల్లో గడ్డి కలుషితమై మా పశువులు తింటే వాటి ప్రాణాలకే ముప్పు. మాకు నష్టం కలిగించే దేనినైనా అడ్డుకుంటాం. పచ్చని పంట పొలాలు పండే ఈ ప్రాంతంలో ఈ ఫ్యాక్టరీ అవసరం లేదు. ఎక్కడైనా ఏర్పాటు చేసుకోండి.

**- పరమేశ్వర్‌గౌడ్**

## అనుమతి రద్దు చేసే వరకు..



అనుమతులు రద్దు చేసే వరకు మా పోరాటం ఉంటుంది. ఫ్యాక్టరీ వ్యర్థాలతో పచ్చని పొలాలు బీళ్లుగా మారే అవకాశం ఉన్నది. అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నది. ఇప్పటికే నారాయణపేట జిల్లా చిత్తనూర్, నిర్మల్ జిల్లా గుండంపల్లి, దిలావర్‌పూర్ రైతులు వ్యతిరేకించారు. ఫ్యాక్టరీ సమీపంలో మాకు 20 ఎకరాల భూమి ఉంది. కంపెనీ వస్తే బీడుగా పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఉన్న భూమి పోతే మేము ఎలా బతకాలి. ఆందోళనలు చేస్తే పోలీసులు భయపెడుతున్నారు. ఎవరికీ భయపడే ప్రసక్తి లేదు. ప్రాణాలైనా అడ్డు పెట్టి ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకుంటాం.

**- జయరామిరెడ్డి, రైతు, పెద్ద ధన్వాడ**

## ప్రభుత్వం స్పందించాలి



ఫ్యాక్టరీ వస్తే సాగు, తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నది. పనులు జరిగే సమీపంలోనే కేసీఆర్ ప్రభుత్వం పేద దళితులకు 152 ఎకరాలు కేటాయించింది. ఫ్యాక్టరీ ఏర్పాటైతే కాలుష్యంతో పచ్చని పొలాలు బీళ్లుగా మారతాయి. మాకు అన్యాయం జరిగే ఈ ఫ్యాక్టరీ మాకు అవసరం లేదు. 2009లో వరదలు వచ్చిన సమయంలో దళితుల ఇండ్ల నిర్మాణం కోసం నాటి సర్కారు ఆరెకరాలు కేటాయించింది. ఇండ్లకు కేటాయించిన భూమి పక్కనే కంపెనీ నఏర్పాటు చేస్తున్నారు. మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తాం.

**- హన్మంతురెడ్డి, రైతు**

# రేషన్ బియ్యం పట్టివేత

గట్టు, జనవరి 31 : మండలంలోని తప్పెట్లమొర్సులో బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. 15నుంచి 20 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు సమాచారం. బియ్యం తరలిస్తున్న వాహనాన్ని తనిఖీ చేస్తుండగా అందులోని వారు పరారయ్యారని తెలిసింది. బొలెరో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు. ఈ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచమని నాయకుల నుంచి పోలీసు ఉన్నతాధికారులకు ఒత్తిళ్లు వచ్చినట్లు సమాచారం.

## ట్రాఫిక్ క్లియర్ చేసిన మాజీ ఎమ్మెల్యే బీరం

కొల్లాపూర్, జనవరి 31: కొల్లాపూర్‌లోని ఈదమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో మాజీ ఎమ్మెల్యే బీరం ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.